సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 22 । మార్చి । 2024

I



25 నుంచి మల్లూరమ్మ జాతర

మల్లూరు పంచాయతీ కొత్తపల్లెలో వెలసిన మల్లూరమ్మ తల్లి అమ్మలగన్న అమ్మగా విరాజిల్లుతోంది. ఈ నెల 25 నుంచి తిరునాల జరగనుంది. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
రాయచోటి :	6.30	5.02
రాజంపేట :	6.30	5.00
పీలేరు :	6.33	4.56
మదనపల్లె :	6.32	5.04

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.140	రూ.170
రెండోరకం	రూ.80	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 27 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	371	371
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 69.580 కిలోలు

న్యూస్‌రీల్

22న డయల్‌యువర్ డీపీటీఓ

రాయచోటి అర్బన్: డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి (డీపీటీఓ) రాము ఒక ప్రకటనలో కోరారు. 22వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సమస్యలపై విన్నవించవచ్చన్నారు. జిల్లాలోని ప్రయాణికులు తమ సలహాలు,సూచనలను,సమస్యలను 8985283211 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

టీచర్ సస్పెన్షన్ కొనసాగింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం బాలాజీనగర్ ఉర్దూ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు నుజహత్ నఫీసా సస్పెన్షన్ కొనసాగిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి యు.శివప్రకాష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు నెలల క్రితం ఆమె సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. నఫీసా సస్పెన్షన్ రద్దు చేసి అదే పాఠశాలలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు నఫీసా ఉపాధ్యాయురాలు వద్దని పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. దీంతో అధికారులు తదుపరి ఉత్తర్వులు వచ్చేదాక ఆమె సస్పెన్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

సీసీపీ శిక్షణ ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్: జిల్లాలో 21వ తేది నుంచి 3 రోజుల పాటు నిర్వహించే సీసీపీ (కేర్ క్యాంపెయిన్ ప్రోగ్రామ్)ను గురువారం డీఎంఅండ్ హెచ్‌ఓ కొండయ్య ప్రారంభించారు. పట్టణంలోని రామాపురం పట్టణ ఆరోగ్యకేంద్రంలో రాయచోటి డివిజన్ పరిధిలో నిర్వహించే శిక్షణ కార్యక్రమంను డీఎంఅండ్ హెచ్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లలో పనిచేస్తున్న సీహెచ్‌ఓ, ఎంఎల్ హెచ్‌పీ (సమాజ ఆరోగ్య అధికారులకు జిల్లాలోని 3 డివిజన్‌లలో ఒక్కో డివిజన్‌కు 3 బ్యాచ్‌లు చొప్పున మొత్తం 9 బ్యాచ్‌లలో ఎంపిక చేసిన ముగ్గురు వైద్యులకు విజయవాడలో శిక్షణ ఇచ్చారన్నారు. ఇలా శిక్షణ పొందిన వైద్యులు డీఓటీలుగా వ్యవహరిస్తూ 3 డివిజన్‌లలోని సీహెచ్‌ఓలకు గురువారం నుంచి శిక్షణను ఇస్తారన్నారు. డీపీఎంఓ రియాజ్‌బేగ్ మాట్లాడుతూ జిల్లా కో-ఆర్డినేటర్ సంధ్య ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో టీఓటీ డాక్టర్ జవహర్‌బాబు, రాయచోటి డివిజన్‌లో వివిధ పీహెచ్‌సీలలో పనిచేస్తున్న సీహెచ్‌లు హాజరయ్యారు.

ఆప్కో వస్త్రాలపై డిస్కౌంట్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకుని ఆప్కో వస్త్రాలపై 30 నుంచి 50 శాతం వరకు ప్రత్యేకంగా డిస్కౌంట్ అందించనున్నట్లు ఆప్కో సంస్థ ఎండీ పవనమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని చేనేత వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 50 శాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు. కడప నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్దగల తమ షోరూంలో కూడా ఈ డిస్కౌంటుతోపాటు 1+1, 1+2 ఆఫర్లు సైతం ఉన్నాయన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరులలోగల షోరూంలలో కూడా ఈ ఆఫర్లు ఉంటాయన్నారు. ప్రజలు చేనేత వర్షాలను కొనుగోలు చేసి చేనేతలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

జాతీయస్థాయి జట్టుకు ఎంపిక



విద్యార్థితో పాఠశాల కరస్పాండెంట్, తదితరులు

పులివెందుల టౌన్: అనంతపురంలోని ఆర్డీటీ మైదానంలో ఈనెల 15వ తేదీన రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల నుంచి దాదాపు 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో పులివెందుల వెంకటప్ప మెమోరియల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బద్రీనాథ్ ప్రతిభ కనబరిచి జాతీయజట్టుకు ఎంపికయ్యాడు. మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో ఈనెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ జేసునాథ్‌రెడ్డి తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ సారా, ప్రిన్సిపాల్ మంజుల, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రభావతి విద్యార్థికి అభినందనలు తెలిపారు.

ఆది లేదు.. అంతం లేదు!

- రాజకీయ అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న మాజీ ఎమ్మెల్యే
- బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే టికెట్ కోరడంతో ఇంటి పోరు
- సోదరులంతా ఒక వైపు... ఆదినారాయణరెడ్డి ఒక్కడు మరోవైపు
- ఇపుడు కడప ఎంపీ సీటు కోసం ఆరాటం
- ఢిల్లీ టు విజయవాడ వరకూ బీజేపీ పెద్దల చుట్టూ ప్రదక్షిణ



సాక్షి ప్రతినిధి, కడప: మాజీ ఎమ్మెల్యే దేవగుడి ఆదినారాయణరెడ్డి ఎత్తుగడలు ఈమారు బెడిసికొట్టాయి. తనను మించిన రాజకీయ వ్యూహకర్త లేరనే భావన ఆయనలో మెండుగా ఉండేది. అనుచరులైనా, సోదరులైనా తన అడుగుజాడల్లోనే నడవాలనే మొండితనం ప్రతి సందర్భంలోనూ కన్పించేది. అదే రీతిగా ఈమారు ఎన్నికల్లో ఎత్తుగడలను అవలంబించారు. తెరవెనుక మంత్రాంగం నిర్వహించి బీజేపీ తరఫున జమ్మలమడుగు ఎమ్మెల్యే టికెట్ దక్కించుకోవడంలో సఫలమయ్యారు. ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి. అప్పటికే ఆది అన్న, మాజీ ఎమ్మెల్సీ అయిన దేవగుడి నారాయణరెడ్డి కుమారుడు భూపేష్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా టికెట్ తనకే ఖాయమనే ధీమాలో ఉన్నారు. ఈ మేరకు ప్రచారం కూడా చేశాడు. అయితే బాబాయ్ చేసిన పనికి ఖిన్నుడయ్యాడు. అంతకు ముందు కూడా రెండుసార్లు తన రాజకీయ వారసుడు భూపేష్ అని చెబుతూనే ఆది ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారు. ఈసారైనా తనకు టికెట్ దక్కుతుందని భావించి భూపేష్, ఆయన తండ్రి నారాయణరెడ్డితో పాటు ఇతర దేవగుడి సోదరులంతా ఒకవైపు చేరిపోయారు. ఆదిక వ్యతిరేకంగా సమావేశాలు కూడా పెట్టుకున్నారు. ఇలాంటి తరుణంలో ఊహించని విధంగా ఆది రాజకీయ అనిశ్చితిలో పడిపోయారు. దేవగుడి సోదరులంతా ఒకవైపు, ఆది ఒక్కడు మరోవైపుగా పరిస్థితి మారింది. దీంతో బీజేపీ ఎమ్మెల్యే టికెట్ తీసుకోవాలా? లేక కడప ఎంపీ సీటు అడగాలా అనే అనే ఆలోచనలో పడిపోయారు.'ముందు నుయ్యి, వెనుక గొయ్యి' అన్నట్లుగా ఆయన పరిస్థితి మారింది. ఎందుకంటే బీజేపీ తరఫున ఎమ్మెల్యే టికెట్ తీసుకుంటే గెలుపు ఖాయం కాకపోయినా గట్టిపోటీ అయినా ఇచ్చే అవకాశముండేది. మరోవైపు ఈపాటికే పొత్తులో భాగంగా కడప ఎంపీ సీటు శ్రీనివాసులురెడ్డికి ఇవ్వగా, ఆయన చివరిక్షణంలో చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో ఆదికి బీజేపీ తరఫున కడప ఎంపీ సీటు ఇస్తారా, ఒకవేళ ఇచ్చినా చిత్తుగా ఓడిపోతే పరువు పోతుందేమో అనే మీమాంసలో పడ్డారు.

సులువుగా అధికారపీఠం

రాజకీయాల్లో ఆదినారాయణరెడ్డి కష్టం లేకుండానే అధికారపీఠం చేజిక్కించుకున్నారు. మునుపటి జమ్మలమడుగు వర్గ రాజకీయాల్లో గుండ్లకుంట శివారెడ్డి వ్యతిరేకశక్తులన్నీ ఏకమై నిర్మించుకున్న సౌధంలోకి అనూహ్యంగా ఆదినారాయణరెడ్డి వచ్చి చేరిపోయారు. దేవగుడి నారాయణరెడ్డి పదేళ్లుగా సర్వశక్తులు ఒడ్డి వర్గాన్ని బలోపేతం చేసుకున్నారు. 2004లో అదే వర్గానికి నారాయణరెడ్డి స్థానంలో ఆదినారాయణరెడ్డి నాయకత్వం వహించారు. అప్పట్లో దేవగుడి కుటుంబం విచ్ఛిన్నం కాకూడదనే దృక్పథంతో నారాయణరెడ్డి పక్కకు తప్పుకొని ఆదికి అవకాశం ఇచ్చినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. 'వైఎస్' అనే చెట్టు నీడన ఎదిగిన దేవగుడి కుటుంబం అటు రాజకీయంగా, ఇటు ఆర్థికంగా స్థిరపడింది. ఆ తర్వాత తనకు మించిన నాయకుడు జిల్లాలో లేరనే భావన మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిలో క్రమంగా బలపడినట్లు పలువురు చెప్పుకొస్తున్నారు.

దేవగుడి సోదరుల తిరుగుబాటు

20 ఏళ్ల క్రితం దేవగుడి నారాయణరెడ్డిని పథకం ప్రకారం ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పించిన ఆది ప్రస్తుతం ఆయన తనయుడు భూపేష్‌రెడ్డిని పక్కకు తప్పించే ప్రయత్నంలో సఫలమయ్యారు. టీడీపీ ఇన్‌చార్జిగా భూపేష్‌రెడ్డి ఎన్నికల్లో పోటీ చేస్తారని భావిస్తున్న తరుణంలో ఆ సీటు బీజేపీకి కట్టబెట్టేలా ఆది తెరవెనుక చర్యల్లో సక్సెస్ అయ్యారు. జమ్మలమడుగు టికెట్ బీజేపీకి ఇస్తున్నట్లు చంద్రబాబు సైతం భూపేష్‌కు వెల్లడించినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో దేవగుడి సోదరులంతా సమావేశమయ్యారు. భూపేష్ మరోమారు మాజీ ఎమ్మెల్యే ఆది చర్యల కారణంగా ధృతరాష్ట్రుడి కౌగిలిలో చిక్కుకున్నారని పసిగట్టారు. బీజేపీకి టికెట్ కేటాయించినా సరే, భూపేష్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలపాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆమేరకు గ్రామస్థాయి కార్యకర్త వరకూ అదే సందేశాన్ని చేరవేసి, ప్రచారం కొనసాగిస్తున్నారు. ఎప్పుడూ రాజకీయాలకు దూరంగా ఉండే దేవగుడి గోపాల్‌రెడ్డి సైతం భూపేష్‌కు మద్దతుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఆది మినహా తక్కిన సోదరులు అందరూ భూపేష్‌కు అండగా నిల్చేందుకు సిద్ధమై ఆచరణలోకి దిగారు. దీంతో ఆది డైలమాలో పడ్డారు. సోదరులను కాదని, తాను మాత్రమే నియోజకవర్గ రాజకీయాలు నెగ్గుకువచ్చే పరిస్థితి లేకపోవడమే అందుకు కారణంగా విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

వైఎస్ కుటుంబానికి వెన్నుపోటు

రాజకీయంగా ఆదరించి అంచెలంచెలుగా ఎదిగేందుకు తోడ్పడిన వైఎస్ కుటుంబానికి ఆదినారాయణరెడ్డి నుంచి వెన్నుపోటు తప్పలేదు. పదేళ్లు కష్టపడ్డ దేవగుడి నారాయణరెడ్డికి 2004 ఎన్నికల్లో గెలుపు తప్పదని భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో వెన్నుపోటు పొడిచారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎమ్మెల్యే అయ్యాక సరిగ్గా 12 ఏళ్లకు అదే ఆది 2016లో వైఎస్ కుటుంబానికి వెన్నుపోటు పొడిచారు. 2014లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఆపై రాజకీయ జీవితాన్ని ఇచ్చిన వైఎస్ కుటుంబాన్ని సైతం తూలనాడారు. నోటికి వచ్చినట్లుగా ఆరోపణలు చేస్తూ వచ్చారు. ఇవన్నీ జగమెరిగిన సత్యాలు. మంత్రి హోదాలో ఆది చర్యలు గమనించిన ప్రజలు తదుపరి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు. కడప ఎంపీగా పోటీ చేసి ఘోర పరాభావం పాలయ్యారు. 3.80లక్షల ఓట్లు తేడాతో ఓడిపోయారు. ఆ వెంటనే తెలుగుదేశం పార్టీ వీడి బీజేపీలో చేరిపోయారు. అప్పటి నుంచి నియోజకవర్గానికి దూరంగా ఉన్న ఆయన మరోమారు తెరవెనుక మంత్రాంగం ద్వారా జమ్మలమడుగులో హాట్‌టాపిక్ అయ్యారు.

ఆది యూటర్న్

ఇంటిపోరును పసిగట్టిన ఆదినారాయణరెడ్డి బీజేపీ టికెట్‌పై యూటర్న్ తీసుకున్నట్లు సమాచారం. జమ్మలమడుగు సీటు వద్దే వద్దని ఢిల్లీ నుంచి విజయవాడ వరకూ బీజేపీ పెద్దల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లు తెలుస్తోంది. అవసరం అనుకుంటే కడప పార్లమెంట్‌కు పోటీ చేయమన్నా చేస్తా, జమ్మలమడుగు టికెట్ వద్దని మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల వ్యూహంలో తనకు మించిన చతురత లేదని భావించే ఆది పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

దరఖాస్తు స్వీకరణ గడువు పెంపు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఏప్రిల్ నెలలో నిర్వహించ తలపెట్టిన స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు పొందడానికి దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ గురువారం వెల్లడించారు. విద్యార్థుల అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇప్పటి దాకా వివిధ డిగ్రీల పట్టాల కోసం 8,898 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. విద్యార్థులు సకాలంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల్లో వీకేసీ పార్టీ పోటీ

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న జమిలి ఎన్నికల్లో 17 అసెంబ్లీ, 4 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసేందుకు వీసీకే పార్టీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నట్లు, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.టి.యం. శివప్రసాద్ తెలిపారు. మదనపల్లెలోని వీసీకే పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. మదనపల్లె, రాయచోటి, కుప్పం, పలమనేరు, నగరి, సత్యవేడు, చంద్రగిరి, కళ్యాణదుర్గం, బాపట్ల, వేమూరు, తెనాలి, అమలాపురం, మండపేట, చిలకలూరిపేట, సూళ్లూరుపేట, నందిగామ, నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాల తోపాటు రాజంపేట, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. వీసీకే పార్టీ ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్నందున తమ పార్టీ పోటీ చేయదలచిన 17 అసెంబ్లీ, 4 పార్లమెంటు నియోజకవర్గాల జాబితాను వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తిరుమావళవన్ ద్వారా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిలకు అందజేశామని తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు కుదరకపోతే తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీని, దానికి సహకరించే టీడీపీ, జనసేనలను ఘోరంగా ఓడించి, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పాలని శివప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు.



కన్నుల పండువగా నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణోత్సవం

కల్యాణం.. కమనీయం

మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవరోజైన గురువారం వేకువ జామునే మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. తిరుచ్చిలో స్వామివారిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవ ఏర్పాట్లు చేశారు. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక రంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్య ధారణ చేయించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామి వారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం వాహన మండపంలో అలంకరించిన గరుడ వాహనంపై కొత్త దంపతులు కొలువుదీరి ఊరేగారు. –గుర్రంకొండ



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

వైఎస్ జగన్‌ది విప్లవాత్మక పాలన

- అభివృద్ధిలో అగ్రగామిగా మదనపల్లె
- నీటిసమస్యకు శాశ్వత పరిష్కారం
- మేధావులు, విద్యావేత్తల సదస్సులో ఎంపీ మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి తదితరులు

మదనపల్లె: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఇప్పటివరకు మదనపల్లె నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిందని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో నియోజకవర్గంలోని మేధావులు, విద్యావేత్తలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, పలు అసోసియేషన్స్ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో, సీఎం జగన్ నేతృత్వంలో, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో... మదనపల్లె నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై గణాంకాలతో వీడియో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీగా రెండుసార్లు తనకు అవకాశం కల్పించిన మదనపల్లె నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్ల ఎంపీగా ప్రజలు తనకు ఇచ్చిన అవకాశానికి, ఏ విధంగా అభివృద్ధి చేశానో, రానున్న రోజుల్లో ఏం చేయాలనుకుంటున్నానో ...తెలపాల్సిన బాధ్యత తనపై ఉన్నందున సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పారదర్శక పాలన అందించామన్నారు. ప్రజలు గత ప్రభుత్వ పాలనకు, జగనన్న పాలనను బేరీజు వేసుకుని, ఏ ప్రభుత్వంలో మంచి జరిగిందో...ఎవరి పాలనలో సంక్షేమం ఇంటికి చేరిందో, అభివృద్ధి ఎవరు చేయగలరనే నమ్మకం ఉందో వారినే నాయకులుగా ఎన్నుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ గ్రామానికి వెళ్లినా గ్రామసచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, బీఎంసీ..ఇలా కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భవనాలు, చిన్న సర్టిఫికేట్ నుంచి ఎరువుల వరకు అన్ని సొంతగ్రామాల్లోనే అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఇదే గుడ్ గవర్నెన్స్‌కు నిదర్శనమన్నారు. అలాగే నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంతగా ఐదేళ్లలో 230 రోడ్డు పనులు చేశామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన గణనీయమైన అభివృద్ధికి కళ్లముందు కనిపిస్తున్న సజీవసాక్ష్యాలే నిదర్శనమన్నారు. అభివృద్ధి కలకాలం కొనసాగాలంటే ఎంపీగా మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేష్ గౌడ, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకా చలపతి, నూర్‌ఆజం, పీకేఎం-ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్‌అహ్మద్ పాల్గొన్నారు. అలాగే జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, సీహెచ్.రామచంద్రారెడ్డి, వెలుగుచంద్ర, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారథి, జిల్లా డాక్టర్ల విభాగం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్.ఏ.కరీముల్లా, బోనా సిజాన్‌బాబు పాల్గొన్నారు.

ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి

మదనపల్లె నియోజకవర్గంలోని దశాబ్దాల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేశామన్నారు. రూ.5వేల కోట్లతో గాలేరు-నగరి, గండికోట జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకువచ్చి, రూ.1,200 కోట్లతో హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని మూడింతలు పెంచి, చెరువులన్నింటినీ నీటితో నింపేలా అనుసంధానం చేస్తున్నామని ఎంపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రానున్న 30 ఏళ్ల తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు వాటర్‌గ్రిడ్ పథకంతో ప్రతి గ్రామానికి పైప్‌లైన్ ద్వారా ఆర్వో వాటర్ అందించేందుకు రూ.2,400 కోట్లతో జలజీవన్‌మిషన్ కింద పనులు జరుగుతున్నాయన్నారు. ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లాస్థాయికి పెంపుచేయడమే కాకుండా 189లక్షల రూపాయల ఖర్చుతో ఆక్సిజన్‌ప్లాంట్, అధునాతన వసతులు సమకూర్చామన్నారు. రూ.500కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందన్నారు. ఎంపీ కోటాలో మంజూరైన కేంద్రీయ విద్యాలయం మదనపల్లెకు వచ్చేలా కృషిచేశానన్నారు. చారిత్రక బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేయడంతో పాటుగా, అనిబిసెంట్ యూనివర్శిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు జీఓ తీసుకువచ్చామన్నారు. మదనపల్లె-అనంతపురం హైవే విస్తరణతో పాటుగా, రూ.1,852 కోట్లతో తిరుపతి-మదనపల్లె ఫోర్‌లేన్ నిర్మాణం చేస్తున్నామన్నారు. ఇవేకాకుండా కరోనా కాలంలో ఎనలేని సేవలు చేశామన్నారు. మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్ పథకంలో రూ.7కోట్లు నిధులతో ఫ్లాట్‌ఫామ్ నిర్మాణంతో పాటు ఆధునీకీకరణ చేయించామని వెల్లడించారు.

రానున్న ఐదేళ్లలో చేయబోయే లక్ష్యాలు..

- మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా అమ్మచెరువుమిట్ట, బెంగళూరురోడ్డు, చెంబకూరురోడ్డు, నిమ్మనపల్లె, తిరుపతిరోడ్లను కలుపుతూ ఔటర్‌రింగ్‌రోడ్డు ఏర్పాటు
- నియోజకవర్గ సాగు,తాగునీటి కష్టాలను తీర్చేందుకు నిర్దేశించిన ప్రాజెక్టులను పూర్తిచేసి, దశాబ్దాల నీటిసమస్యను పరిష్కరించడం.
- నియోజకవర్గానికి నీటిలభ్యత పెరిగాక, పరిశ్రమలను తీసుకువచ్చి, స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం.
- అనిబిసెంట్ యూనివర్శిటీ, మెడికల్ కాలేజీ అభివృద్ధి

హోమియోపతికి నూతన భవనం

ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీలు వాటికి అనుసంధానంగా ఆసుపత్రులు రాజమండ్రి, గుడివాడ తరువాత రాయలసీమ కేంద్రంగా కడపలో మాత్రమే ఉంది. ఇప్పటికే కొనసాగుతన్న ఈ మెడికల్ కాలేజీకి పాత రిమ్స్‌లో కొత్త భవనం ఏర్పాటుకు పనులు వేగంగా సాగుతున్నాయి.

- కడపలోని పాత రిమ్స్‌లో ఏర్పాటు
- 50 సెంట్ల స్థలంలో నిర్మాణానికి చర్యలు



నిర్మాణంలో ఉన్న హోమియోపతి కళాశాల భవనం

కడప రూరల్: రాయలసీమకు కడప కేంద్రంగా మరియాపురం ప్రాంతంలో 1982లో ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. అనుసంధానంగా కడప పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి కూడా ఏర్పడింది. ప్రస్తుతం ఈ ఆసుపత్రి పాత రిమ్స్‌లోని నూతన భవనంలో కొనసాగుతోంది. ఈ మెడికల్ కాలేజీ కడప నగరానికి కాస్త దూరంలో కొనసాగుతోంది. ఆసుపత్రి మాత్రం పాత రిమ్స్‌లో ఏర్పాటైంది. మెడికల్ కాలేజీ కూడా ఆసుపత్రికి అనుసంధానంగా దగ్గరలో ఉంటే ప్రయోజనంగా ఉంటుందని కొంత మంది భావించారు. ఈ అంశాన్ని ఆయుష్ కమిషనర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఒక నెల కిందట ఇక్కడికి వచ్చి ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రికి ఎదురుగా ఉన్న స్థలంలో మెడికల్ కాలేజీకి కొత్త భవనాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రభుత్వానికి సూచించారు. ఆ మేరకు ప్రభుత్వం 50 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. దీంతో 20 రోజుల నుంచి ఆ స్థలంలో ఉన్న పాడుబడిన భవనాలను తొలగిస్తున్నారు. ఈ స్థలంలో ఏపీఎంఐడీసీ ద్వారా భవన నిర్మాణానికి చర్యలు చేపడుతారు.

'ఆయుష్'యూనివర్సిటీ రానుందా.?

ఈ క్రమంలో కడపకు ప్రతిష్టాత్మకమైన 'ఆయుష్' యూనివర్సిటీ వస్తోందా అంటే అవునని ఆ విభాగానికి చెందిన వారు అంటున్నారు. ఆయుష్ పరిధిలోకి ఆయుర్వేదం, యోగా, యునానీ, సిద్ధయోగ, హోమియోపతి విభాగాలు వస్తాయి. ఆయుష్ యూనివర్సిటీ ఏర్పాటు వల్ల అన్ని విభాగాలకు చెందిన పరిపాలనా అంశాలు వస్తాయి. యూనివర్సిటీ ఏర్పాటు వల్ల ఆయుష్ విభాగాలు అభివృద్ధి చెందడానికి దోహదపడనుంది. కాగా దేశంలో ఇప్పటి వరకు ప్రభుత్వ యూనివర్సిటీ గుజరాత్‌లోని గోరఖ్‌పూర్‌లో మాత్రమే ఉంది.

8అనుసంధానంతో ప్రయోజనాలు

ఆసుపత్రికి అనుసంధానంగా దగ్గరలోనే మెడికల్ కాలేజీ భవనం ఏర్పాటు కావడంతో అటు కాబోయే వైద్యులకు ఇటు రోగులకు సౌలభ్యం కలుగనుంది. మెడికల్ కాలేజీ విద్యార్థులు తమ కోర్సును అభ్యసించడంలో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగులను పరీక్షించాల్సి ఉంటుంది. అంటే మరియాపురం ప్రాంతంలో ఉన్న మెడికల్ కాలేజీ నుంచి కడపలోని పాత రిమ్స్‌లో ఉన్న ఆసుపత్రికి రావాలంటే కొంచెం కష్టంతో కూడుకున్న పని. ప్రస్తుతం ఈ అసౌకర్యానికి అడ్డుకట్ట పడనుంది. మెడికల్ కాలేజీలో ప్రతి ఏటా ఒక ఏడాదికి ఒక బ్యాచ్‌కు నాలుగున్నర సంవత్సరాల కోర్సుకు 38 మంది బీహెచ్‌ఎంఎస్ (బ్యాచ్‌లర్ ఆఫ్ హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జన్) కోర్సుకు సంబంధించి యూజీ (అండర్ గ్రాడ్యుయేట్స్), మూడేళ్ల కోర్సుకు సంబంధించి 8 మంది పీజీ స్టూడెంట్స్ హోమియోపతి వైద్య విద్యను అభ్యసిస్తుంటారు.

కొత్త భవనం ఏర్పాటుకు చర్యలు

పాత రిమ్స్‌లో ఉన్న ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రికి ఎదురుగా ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ కోసం కొత్త భవనం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది వరకే ఈ భవన నిర్మాణానికి 50 సెంట్ల స్థలం మంజూరైంది.నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి.

– డాక్టర్ రమాదేవి, ప్రిన్సిపల్, ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ

క్లుప్తంగా

20 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య తెలిపారు. గురువారం సెబ్ సీఐ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని పచ్చారమాకులపల్లె తాండాలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బుక్కే పరుశునాయక్, బుక్కే శ్రీరాములునాయక్ ఒక్కొక్కరూ పది లీటర్ల చొప్పున సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

40 మద్యం బాటిళ్లు సీజ్



అరెస్టు చూపుతున్న ఎస్ఐ రామక్రిష్టారెడ్డి

కలకడ : అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్టారెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం, చీనెపల్లికి చెందిన పాపన్నగారి గంగయ్య అనే వ్యక్తి 40 క్వార్టర్ బాటిళ్ల విస్కీని అనుమతిలేకుండా కారులో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో పోలీసులు హరిబాబు, సుబ్బయ్య, రమేష్ పాల్గొన్నారు.

భక్తుల పాలిట కల్పవల్లి.. మల్లూరమ్మ తల్లి



మల్లూరమ్మ అమ్మవారి మూలవిరాట్



మల్లూరమ్మ అమ్మవారి ఆలయం

25 నుంచి తిరునాల

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు పంచాయతీ కొత్తపల్లె గ్రామంలో వెలసియున్న మల్లూరమ్మ తల్లి అమ్మలగన్న అమ్మగా విరాజిల్లుతోంది. ఈ నెల 25వ తేదీ సోమవారం నుంచి తిరునాల మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 25న నిండు తిరునాల, 26న మైల తిరునాల ఉంటుందన్నారు. ఈ నెల 25వ తేదీ రాత్రి అమ్మవారిని తిమ్మారెడ్డిగారిపల్లె నుండి మంగళవాయిద్యాలతో ఆలయం వద్దకు పల్లకీలో తీసుకువచ్చి 26న ఉదయం సిద్దలపూజ, బోనాలు, సంతానం లేని వారు అమ్మవారికి వరపడుట అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ, ప్రసాదం వితరణతో పాటు జాతరకు వచ్చే వారికి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. అదే విధంగా మొక్కుబడులు కలిగిన భక్తులు చాందినీబండ్లను ఆలయం చుట్టూ తిప్పి వారి మొక్కుబడులను అదే రోజు రాత్రి తీర్చుకుంటారు. 26న సాయంత్రం అమ్మవారిని యధాస్థానానికి చేర్చడంతో తిరునాల ముగియనుంది. ఈ జాతరకు మల్లూరు కస్బా నుంచి చౌడేశ్వరీదేవి అమ్మవారు జ్యోతులతో మల్లూరమ్మ దగ్గరకు ఊరేగింపుగా రానున్నారు. జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన ఈ తిరునాలకు జిల్లా వాసులే కాకుండా చెన్నై, బెంగళూరు, అనంతపురం, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు. లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం ఇతర ప్రముఖులు ఈ జాతరకు విచ్చేయనున్నారు. తిరునాల సందర్భంగా పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర

విజయనగరం రాజుల పరిపాలనా కాలంలో సామంతరాజుగా ఈ ప్రాంతవాసి జగ్గరాజు ఉండేవారు. వారి రాజ్యంలో కలరా, ప్లేగు, మలేరియా వంటి వ్యాధులు, కరువు కాటకాలు చుట్టుముట్టాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జగ్గరాజు భార్యకు దేవత కలలో కనిపించి ఈ ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించి పూజలు చేయాలని చెప్పగా 16వ శతాబ్దంలో మల్లూరమ్మ ఆలయం నిర్మించి పూజలు జరుపుతున్నట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పటి నుంచి రోగాలు, కరువు కాటకాలు దూరమై ప్రజలందరూ సుభిక్షంగా జీవించడం ప్రారంభమైంది.

దేవుడా మాకిక దిక్కెవరు!

- పుణ్య క్షేత్రానికి రైలులో ప్రయాణిస్తూ కుప్పకూలిన భర్త
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి





ప్రకాష్ (ఫైల్),రోదిస్తున్న మృతుడి భార్యను సముదాయిస్తున్న మహిళలు

పెద్దతిప్పసముద్రం : కుటుంబ సభ్యులతో మొక్కుబడి చెల్లించేందుకు తిరుపతికి రైలులో ప్రయాణం చేస్తూ ప్రకాష్ (27) అనే వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిన విషాద సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని బూర్లపల్లికి చెందిన మునిస్వామి, సుజమ్మ దంపతులు. వీరి కుమారుడు ప్రకాష్ చిన్నతనంలో ఉండగానే తల్లి సుజమ్మ మృతి చెందింది. అప్పటి నుంచి అతడి ఆలనా పాలన ఇదే మండలంలోని కమ్మచెరువులో ఉండే అవ్వా, తాతలు చూసుకునేవారు. అంతే గాక అతనికి ఇదే మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ కుక్కలపల్లికి చెందిన విజితతో రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. అనంతరం ఈ దంపతులు బూర్లపల్లిలో కాపురం ఉంటూ ఎంతో అన్యోన్యంగా జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో ఈ దంపతులకు ఓ కుమారుడు జన్మించాడు. 11 నెలల కుమారుడి మొక్కుబడి చెల్లించేందుకు బుధవారం కుటుంబ సభ్యులతో కలసి రైలులో తిరుపతికి బయలు దేరారు. అనంతరం రైలు చంద్రగిరి సమీపం వద్దకు వెళుతుండగా ప్రకాష్ ఒక్కసారిగా స్పృహ తప్పి కుప్ప కూలిపోయాడు. రైల్వే సిబ్బంది సహాయంతో హుటాహుటిన అతన్ని 108 వాహనం ద్వారా తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతి పిన్న వయసులో భర్తను పోగొట్టుకున్న ఆ ఇల్లాలు చంటి బిడ్డతో దేవుడా మాకిక దిక్కెవరు అంటూ భర్త మృతదేహం ఎదుట రోదిస్తున్న దృశ్యం చూపరులను కంట తడి పెట్టించింది. ప్రకాష్ మృతితో బూర్లపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ నాగార్జున రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



కర్ణాటక మద్యంతో పాటు నిందితులను అరెస్టు చూపుతున్న తాలూకా సీఐ ఎస్.శేఖర్

మదనపల్లె : పెద్ద ఎత్తున తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్. శేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గురువారం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ చీకలబైలు వద్ద తనిఖీలు నిర్వహించామన్నారు.పెద్ద ఎత్తున కర్ణాటక మద్యం అటవీ ప్రాంతం ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, సిబ్బందితో కలసి మేడిపల్లి అటవీ ప్రాంతంలో దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మదనపల్లి మండలం చీకలబైలుకు చెందిన నరసింహులు కుమారుడు మండెం నవీన్ (29), గంగరాజు కుమారుడు నాగినేని శ్రీనివాసులు(30) కర్ణాటక రాష్ట్రం నుంచి 7 కేసుల కర్ణాటక మద్యం(హైవార్డ్స్ విస్కీ 90 ఎం ఎల్) ద్విచక్ర వాహనంలో చీకలబైలుకు తరలిస్తుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.26,880 విలువ గల 672 టెట్రా ప్యాకెట్లు మద్యంతోపాటు, పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఈ దాడిలో ఎస్ఐలు రవికుమార్, వెంకటేష్, ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలి

వర్క్‌షాపులో పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ దిశానిర్దేశం



వర్క్‌షాపులో పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎం.సి.సి)ని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్, ఎలక్షన్ సెల్ అధికారుల వర్క్‌షాపునకు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లైసెన్స్‌డ్ తుపాకులను వెంటనే డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 2024 ఎన్నికల నేపథ్యంలో నమోదైన నేరాల దర్యాప్తు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. నేరస్థులకు సాక్ష్యాధారాలతో శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల సంబంధిత కేసుల్లో దర్యాప్తు నైపుణ్యత పెంపొందించుకుని వేగవంతంగా విచారణ జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని, ఎక్కడా చిన్న ఘటనకు తావుండకూడదని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, డీఎస్పీలు ఎన్. సుధాకర్, మురళీధర్, డాక్టర్ టి.డి యశ్వంత్, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, రవికుమార్, ఇన్స్‌పెక్టర్లు యు. వెంకటకుమార్, వినయ్‌కుమార్ రెడ్డి, రాజా ప్రభాకర్, సయ్యద్ హాసం, ఇబ్రహీం, రమణారెడ్డి, శంకర్‌నాయక్, రాంభూపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహం చేయలేదని యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన మహేష్

లక్కిరెడ్డిపల్లి : వివాహం చేయలేదని మహేష్ (21) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన లక్కిరెడ్డిపల్లి మండలం, బి.ఎర్రగుడి గ్రామం, కాపుపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మహేష్ తనకు వివాహం చేయాలని తల్లిదండ్రులను కోరగా పెద్దవాడు ఉన్నాడు అతనికి వివాహం చేసిన తరువాత నీకు చేస్తాంలే అని చెప్పారు. దీంతో మనస్థాపానికి గురై గురువారం తెల్లవారుజామున ఉరివేసు కొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్తతో గొడవపడి..



మృతి చెందిన వంటేరు లక్ష్మీదేవి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి కస్పాకు చెందిన వంటేరు లక్ష్మీదేవి (27) అనే వివాహిత గురువారం తెల్లవారుజామున బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు..భార్యా భర్తలు తరచూ గొడవపడేవారు. గురువారం తెల్లవారుజామున లక్ష్మీదేవి భర్తతో గొడవపడి పల్లెకు సమీపంలోని బావిలో దూకింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు భర్తపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

చిన్నమండెం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని కేశాపురం గ్రామం దేవలంపేటకు చెందిన గుడి లక్షుమ్మ ఈనెల 20వ తేదీ రాత్రి మృతి చెందింది. ఈ నెల 10వ తేదీన గాయపడిన ఆమెను తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 20వ తేదీ రాత్రి మృతి చెందిందని పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన పేరం బయారెడ్డిపై మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. చౌడేపల్లి మండలం దిగువపల్లెకు చెందిన కుమార్(35) బోర్ ఫిట్టింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. పనుల్లో భాగంగా ట్రాక్టర్‌లో.. నిమ్మనపల్లి మండలం బండ్లపై గ్రామానికి వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి అదే ట్రాక్టర్‌లో ఇంటికి వెళ్తుండగా, మార్గమధ్యంలో స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి ట్రాక్టర్‌లో నుంచి కింద పడ్డాడు. అతనిపై ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

మూడు మోటార్ సైకిళ్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన మోటార్ సైకిళ్లు

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాగరాజుపేట, శ్రీహరిరావు వీధిలో గురువారం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల నుంచి 3 గంటల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి నారపనేని చంద్రశేఖర్ ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న హోండా డియో మోటార్‌సైకిల్ (నెం. కెఏ 51 ఈజె 1740), టీవీఎస్ ఎక్సెల్ సూపర్ -50 మోటార్ సైకిల్ (ఏపీ04 జె 5571)లకు నిప్పటించి కాల్చివేశాడు. మరికొంతదూరంలో నాగరాజుపేటకు చెందిన న్యాయవాది షేక్ నజీర్‌బాషా హోండా యాక్టివా మోటార్ సైకిల్‌కు నిప్పు పెట్టడంతో పాక్షికంగా కాలిపోయింది. రెండు సంఘటనలకు సంబంధించి ఇద్దరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్ రెడ్డి, తమ ఇద్దరు ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామిలతో కలిసి విచారణ చేపట్టారు. సీపీఓ షేక్ ఆబిద్ సహకారంతో వాహనాలకు నిప్పుపెట్టిన నిందితుడిని స్థానికంగా ఉన్న సీసీ టీవీ ఫుటేజీల ద్వారా గుర్తించారు.

వాహనాలకు నిప్పు పెట్టిన నిందితుడి అరెస్టు

కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలకు నిప్పు పెట్టిన నిందితుడిని గుర్తించారు. కడప పాతబస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న రవీంద్రనగర్‌కు చెందిన బేగ్ మహబూబ్‌బాషా (38)ను కొన్ని గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. గురువారం కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ భాస్కర్‌రెడ్డి నిందితుడి అరెస్ట్ వివరాలను తెలియజేశారు. నిందితుడు కడప నగరంలో హోటళ్లలో పనిచేస్తూ మద్యానికి బానిసగా మారాడు. అలాగే పంచర్లు వేసే సొల్యూషన్‌ను పీల్చేవాడు. ఇతను గతంలో కూడా కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నిద్రిస్తున్న బాలుడి తలను పగులగొట్టిన కేసులో ఆరేళ్ల పాటు జైలు శిక్షను అనుభవించి వచ్చాడు. ఎవరైనా పంచర్లు వేసే సొల్యూషన్‌లను పీల్చుతూ, మత్తుకు బానిసగా మారుతున్న వారు తారసపడితే వెంటనే తమకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

బాలుడిని హత్య చేసిన బాబాయి అరెస్టు

పులివెందుల : పట్టణంలోని నగరిగుట్ట వాటర్ ట్యాంక్ సమీపంలో నివాసం ఉంటున్న రెంటాల అనురాధదేవి కుమారుడు రెంటాల బాబును హత్య చేసిన కేసులో బాబాయ్ సురేష్‌బాబును పోలీసులు అరెస్టు చేశారు. బాలుడిని బ్యాట్‌తో కొట్టి హత్య చేసిన విషయం విదితమే. ఈ హత్యకేసులో నిందితుడిగా ఉన్న సురేష్‌బాబును 20వ తేదీ సాయంత్రం పార్నపల్లిరోడ్డులోని కోతి సమాధి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేసినట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. నిందితుడు మతిస్థిమితం సరిగా లేకపోవడం వల్ల బాలుడిని హత్య చేసినట్లు వారు తెలిపారు.

సీనియర్ సిటిజన్లను నిర్లక్ష్యం చేయరాదు

– జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : సీనియర్ సిటిజన్లనూ ఎవరూ నిర్లక్ష్యం చేయరాదని, వారి సంరక్షణ, భద్రత బాధ్యత వారి పిల్లలదేనని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తెలిపారు. గురువారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో కడప నగరం ఆజాద్‌నగర్‌లో ఉన్న బృందా వయోవృద్ధుల ఆశ్రమాన్ని జడ్జి సందర్శించారు. అక్కడున్న వయోవృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. వారికి అందుతున్న సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011ను వివరించారు. సీనియర్ సిటిజన్స్ ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 14567 లేదా, కడపలోని జిల్లా న్యాయసేవాధికారసంస్థ వారి దృష్టికి తీసుకు రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బృందా ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహకులు బాలసుబ్బయ్య, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎన్నికల నేపథ్యంలో కడప రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపై నిర్వహించిన తనిఖీల్లో 4 కిలోల బరువుగల గంజాయి బండిళ్లను స్వాధీనం చేసుకున్నామని కడప రైల్వే సీఐ నాగార్జున, ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు వారు మీడియాకు వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం 11.20 గంటల ప్రాంతంలో ప్లాట్‌ఫారం-1 పడమర దిశగా గూడ్స్ షెడ్ సమీపంలో చెన్నై నుంచి ముంబయికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లిన తర్వాత ప్రొద్దుటూరుకు చెందిన జాఫర్ అనే వ్యక్తి బ్యాగులో గంజాయిని తీసుకు వెళుతుండగా అరెస్టు చేశామన్నారు.

పుట్టాకు పరాజయాల హ్యాట్రిక్ తప్పదు

- మేము పార్టీని బలోపేతం చేస్తే విషపురుగులా చేరిన పుట్టా
- రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

మైదుకూరు : టీడీపీని తామంతా 42 ఏళ్లుగా బలోపేతం చేస్తే చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరిన చందంగా పుట్టా సుధాకర్ యాదవ్ విషపురుగులా చేరి తమకే అన్యాయం చేశాడని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబును తాను విమర్శించకూడదంటూ వ్యాఖ్యలు చేసిన పుట్టా సుధాకర్‌యాదవ్‌పై గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రెడ్యం మండిపడ్డారు. నీతి నిజాయితీ, నిబద్ధతతో 42 ఏళ్ల పాటు పార్టీకి సేవలు చేస్తే సుధాకర్ యాదవ్ మాటలు నమ్మి తనను పార్టీ నుండి తొలగించిన చంద్రబాబును ఎలా విమర్శించకుండా ఉంటానని ప్రశ్నించారు. తన సొంత మండలం ఖాజీపేటలో టీడీపీకి ఎప్పుడూ మెజారిటీ రాలేదని పుట్టా సుధాకర్ యాదవ్ చేసిన ఆరోపణలపై రెడ్యం వివరణ ఇచ్చారు. పుట్టా సుధాకర్ యాదవ్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదన్నారు. అందుకే ఆయన రెండు సార్లు ఓడిపోయారని, ఈ ఎన్నికల్లో పరాజయాల హ్యాట్రిక్ కొట్టబోతున్నారని జోస్యం చెప్పారు. పుట్టా చెప్పినట్టు ఖాజీపేట మండలంలో టీడీపీకి మెజారిటీ రాలేదని.. అయితే జెండా కట్టలేని, ఏజెంట్లను పెట్టుకోలేని పరిస్థితుల్లో టీడీపీ ఉండగా తాను మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డిని ఢీకొన్నట్టు రెడ్యం తెలిపారు. నిన్నగాక మొన్న రాజకీయాల్లోకి వచ్చి డబ్బులు ఇచ్చి నలుగురిని పార్టీలో చేర్చుకుంటేనే పుట్టా నాయకుడు అయిపోడని ఎద్దేవా చేశారు.

రెచ్చగొడితే రోజూ పుట్టా చిట్టా విప్పుతా..

తనను రెచ్చగొడితే రోజూ పుట్టా సుధాకర్ యాదవ్ చిట్టా విప్పుతానని రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. నమ్మినోళ్లను నట్టేట ముంచే చరిత్ర పుట్టాదని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల వాళ్లను చేర్చుకొని సొంత పార్టీలోని వారికి ఏమీ చేయని చరిత్ర పుట్టాదని విమర్శించారు. ఎవరు నిజాయితీపరులో మైదుకూరులోని శ్రీకృష్ణదేవరాయల సెంటర్‌కు వస్తే తెల్చుకుందామని సవాల్ విసిరారు. మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, మల్లికార్జున రెడ్డి, పిల్లి నాగయ్య పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తో ఎంపీ, ఎమ్మెల్యేలు భేటీ



సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైఎస్సార్‌సీపీ నాయకులు



సీఎం జగన్‌ను కలిసి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జడ్పీటీసీ రామగోవిందరెడ్డి

బ్రహ్మంగారిమఠం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లె క్యాంపు కార్యాలయంలో గురువారం కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి కలిశారు. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ రాజకీయాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. అనంతరం నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని, నియోజకవర్గ నేతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌జీఎస్ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ముఖ్య నేతలు

ప్రొద్దుటూరు: విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నేతలు గురువారం కలిశారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపార వేత్త ధనియాల గంగిరెడ్డి, ఆయన కుమారుడు గంగాధర్‌రెడ్డి, దొరసానిపల్లె ఉపసర్పంచ్ మార్తల లక్ష్మీనారాయణరెడ్డి, కసిరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆల్ ఇండియా రేడియో ఉద్యోగి నాగులారపు జయసింహా గురువారం సీఎం జగన్‌ను కలిశారు. తాను పార్టీ కోసం ఉద్యోగానికి రాజీనామా చేసిన విషయాన్ని తెలిపారు. కార్యక్రమంలో జయసింహా తండ్రి నాగులారపు విజయసారథి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు యానదయ్య, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.